వైభవంగా ధ్వజస్తంభ ఊరేగింపు



పెద్దశంకరంపేటలో సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుమలాపూర్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి సీతారాముల దేవాలయ ధ్వజస్తంభాన్ని ఊరేగింపుతో అంగరంగవైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం శోభాయాత్రలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కళాప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేరళ బృందం వాయిద్యబృందం చేపట్టిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్ డాక్టర్ ఐశ్వర్యరెడ్డి ఆధ్వర్యంలో సాయి తుంబుర వారి కూచిపూడి నృత్యాలు, భారీ హనుమాన్ విగ్రహం ఆకర్షణగా నిలిచాయి.

-పెద్దశంకరం పేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

శివుడికి సూర్య తిలకం

నారాయణఖేడ్ పట్టణంలోని కాశీనాథ్ ఆలయంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఆదివారం తెల్లవారుజామున సూర్య కిరణాలు పరమేశ్వరుడి పాదాలను తాకాయి. కొన్ని నిమిషాల పాటు శివలింగంపై సూర్య కిరణాలు ఉన్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ దృశ్యాన్ని వీక్షించి పులకించిపోయారు. ప్రతీ ఏడాది కాశీనాథుడిని సూర్య కిరణాలు అర్చిస్తాయని ఆలయ అర్చకుడు గురురాజశర్మ తెలియజేశారు.

-నారాయణఖేడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)





ఒకే గొడుగు కిందకు
మహిళా సంఘాలు

సెర్ప్‌లో విలీనం కానున్న మెప్మా

డీఆర్‌డీవో పర్యవేక్షణలో కార్యక్రమాలు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. పట్టణ పేదలకు నిర్మూలన సంస్థ (మెప్మా)ను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేయనున్నారు. విలీన ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు త్వరలో రానున్నాయి. సర్కారు నిర్ణయంతో ఇప్పటివరకు వేరువేరుగా పనిచేసిన మెప్మా, సెర్ప్ అధికారులు, సిబ్బంది కలిసి పనిచేస్తారు.

గ్రామీణ అభివృద్ధి అధికారి పర్యవేక్షణ

మెప్మాను సెర్ప్‌లో విలీన ప్రక్రియ పూర్తయితే ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు పర్యవేక్షణలో కొనసాగుతాయి. ఇప్పటివరకు మెప్మా కార్యక్రమాలను జిల్లా స్థాయి మెప్మా ప్రాజెక్టు అధికారి, పురపాలక స్థాయిలో టీఎంసీ, ఆర్పీలు పనిచేస్తున్నారు. సెర్ప్ కార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో డీఆర్‌డిఏ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. మెప్మాకు సంబంధించి పట్టణాల్లో బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు, ఇందిరా మహిళా శక్తి తదితర ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వీరే కీలకంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు రేషన్ కార్డుల సర్వే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక తదితర పథకాల అమలును పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు

సెర్ప్‌లో మెప్మా విలీనమైతే ఈ రెండు శాఖల ఉద్యోగులు కలిసి కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 40 మంది ఉద్యోగులు, 381 మంది ఆర్పీలు, 11271 సంఘాలు, 1,11,898 మంది సభ్యులు ఉన్నారు.

జిల్లా	ఉద్యోగులు	ఆర్పీలు	సంఘాలు	సభ్యులు
సంగారెడ్డి	14	172	5,264	4,9521
మెదక్	6	66	1,757	18,012
సిద్దిపేట	20	143	4,250	44,365
మొత్తం	**40**	**381**	**11,271**	**1,11,898**

భానుడి ప్రతాపం

ముదిరిన ఎండలు.. ప్రజలు విలవిల

సిద్ధిపేట జిల్లాలో ఐదు మండలాల్లో 41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

అక్కన్నపేట మండలం కట్కూర్‌లో అత్యధికంగా 41.4 డిగ్రీలు

కోహీర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) గత రెండు రోజుల నుంచి భానుడి ప్రతాపానికి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఎండవేడికి విలవిలలాడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా మండలాలలో ఎండల తీవ్రత అధికమవడం వల్ల ప్రజలు ఎండవేడికి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట్, చేర్యాల, బెజ్జంకి కుకునూరు పల్లి, సిద్దిపేట అర్బన్ మండలాలలో ఏకంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రెండు రోజుల నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండల తీవ్రత అధికమవడంతో రైతులు కూలీలు వ్యవసాయ పనులు చేసేందుకు పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులు పాడ్డారు. ఎండలు మళ్లీ ముదరడంతో ప్రజలకు ఇబ్బందులకు తప్పడం లేదు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపించాడు. ఇదిలా ఉండగా మరో రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు ఎండల నుంచి కాస్త ఉపశమనం లభించవచ్చని ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు



ఉమ్మడి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

సిద్దిపేట జిల్లా : కట్కూరు 41.4, చిట్యాల 41.3, బెజ్జంకి 41.3, లగ్దారం 41.2, సిద్దిపేట 41.2, రేబర్తి 41.0, హబ్సిపూర్ 40.9, రాఘవపూర్ 40.9, పోతిరెడ్డిపేట్ 40.9, శనిగారం 40.7, సముద్రాల 40.6, కోహెడ 40.4, అంగడికిష్టాపూర్ 40.4, పెద్దకోడూరు 40.4, చాట్లపల్లి 40.2, ముస్త్యాల 40.1, గజ్వేల్ 40.0, హుస్నాబాద్ 39.8, తుక్కాపూర్ 39.7, దుల్మిట్ట 39.6, గండిపల్లి 39.5, చికోడు 39.3, నంగునూరు 39.3, కొండ్లకండ్ల 39.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా : నాగపూర్ 40.9, మాసాయిపేట 40.8, వెల్దుర్తి 40.6, దామరంచ 40.5, పాతూర్ 40.4, వాడి 40.3 నర్లాపూర్ 40.1, చిట్కూలు 40.0, శివంపేట 40.0, బోడాఘాట్ 39.9 లింగాయపల్లి 39.9, రాజ్‌పల్లి 39.7, కొత్తపేట్ 39.7, కొడిపల్లి 39.6 లక్ష్మాపూర్ 39.6, సర్దన 39.6, కుల్చారం 39.5, పెద్ద శంకరంపేట 39.5, శివనూరు 39.3, బుజరంపేట 39.2, రామాయంపేట 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా: కద్పల్ 39.9, పల్వట్ల 39.8, మనూర్ 39.8, దిగ్వాల్ 39.8 నిజాంపేట్ 39.7, అన్నసాగర్ 39.7 మల్‌చెల్మా 39.6 జిన్నారం 39.6, పుల్కల్ 39.4, ముక్తాపూర్ 39.0, సుల్తాన్‌పూర్‌లో 38.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండ తీవ్రతకు కోహీర్‌లో నిర్మానుష్యమైన వీధి

వేసవిలో జర జాగ్రత్త



డా.అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండలు ముదరడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలో పనిచేసినా.. తిరిగినా వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని అంటున్నారు. స్వీయ జాగ్రత్తలతో వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

వేసవిలో ఎండ నుంచి రక్షణ కోసం ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకపోవడం మంచిది. ఏ పనులున్నా ఉదయం, సాయంత్ర చేసుకోవడం మేలు. తప్పనిసరిగా ఎండల్లో వెళ్లాల్సి వస్తే తలకు తెల్లని రుమాలు ధరించి, తాగునీటిని తీసుకువెళ్లాలి. లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

వేసవిలో ఎటువంటి పానీయాలు తీసుకోవాలి?


వేసవిలో ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్, నిమ్మరసం, ఉప్పు, చక్కెర వేసిన నీళ్లు, లేదా అంబలి, మజ్జిగ తాగాలి. అన్ని రకాల పండ్లు తీసుకోవాలి. ఎండలో నుంచి రాగానే కొద్దిసేపు సేద తీరిన అనంతరం మాత్రమే నీటిని తాగాలి.

వడగాలులతో వచ్చే సమస్యలేమిటి?

వడగాలులతో ఊపరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి మాస్కులు ధరించాలి.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

వడదెబ్బ తగిలితే డీహైడ్రేషన్‌కు గురై తలతిరగడం, వాంతులు, విరేచనాలు అవుతాయి. వెంటనే దవాఖానాకు వెళ్లి చికిత్స పొందాలి. ప్రథమ చికిత్సగా చల్లని గాలి తగిలేలా నీడలో పడుకోబెట్టి ఓఆర్ఎస్ ఇవ్వడం వల్ల కోలుకుంటారు. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స ఇప్పించాలి.



కొత్త పాఠ్యపుస్తకాలు
వచ్చేస్తున్నాయ్

- సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పాఠ్యపుస్తకాలు
- అవసరమైనవి 9.86 లక్షలు, వచ్చినవి 20,710
- వేసవి సెలవుల్లో మండల పాయింట్లకు సరఫరా
- బడి ప్రారంభం రోజు పంపిణీ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నాయి. ప్రతీ ఏటా ఫిబ్రవరి నెల నుంచే పుస్తకాలను తరలించేవారు. కానీ, ఈసారి కొంత ఆలస్యమైంది. సంగారెడ్డి జిల్లాకు 9,86,120 పుస్తకాలు అవసరమని అంచనా వేయగా.. ఇప్పటివరకు 20,710 పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరాయని అధికారులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్కూల్ పాయింట్లకు చేరవేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉచిత నోటు పుస్తకాలు

రెండేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1.40 లక్షల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నారు. ఈసారి 6 లక్షల నోటు పుస్తకాలు అవసరపడుతాయని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ నోటు పుస్తకాలు కూడా ఇంకా జిల్లాకు చేరాల్సి ఉన్నదని అధికారులు వివరించారు. దీంతోపాటు రెండు జతల యూనిఫామ్ అందజేస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీఏవోల దారెటు!

- గ్రామ పరిపాలనాధికారుల నియామకానికి రాత పరీక్ష
- సర్వీసులను పరిగణనలోకి తీసుకోకుండా జీవో 129 విడుదల
- జిల్లాలో ఆప్షన్లు తీసుకోవడానికి ముందుకు రాని వీఆర్వోలు
- ఆప్షన్లకు మరో రెండు రోజులే గడువు
- 16న ఉద్యోగ సంఘాలతో రెవెన్యూ మంత్రి భేటీ



జీవో 129ని రద్దు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోల సంఘం ప్రతినిధులు (ఫైల్)

మెదక్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను రద్దుచేసి వారిని వేరే ప్రభుత్వశాఖల్లో నియమించింది. దీంతో, ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ పథకాలకు లబ్దిదారుల ఎంపిక, విపత్తుల సాయం తదితర విచారణలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తిరిగి గ్రామ పరిపాలనాధికారుల నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగానే జీవో నెంబరు 129 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం పూర్వ వీఆర్వో, వీఆర్ఏలను రాత పరీక్ష ద్వారా గ్రామ పాలనాధికారులుగా తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. పైగా వారు డిగ్రీ ఉత్తీర్ణత, లేదా ఇంటర్ చదివి వీఆర్వోగా కనీసం 5 సంవత్సరాల సర్వీసు కలిగి ఉండాలి. అంతేకాకుండా గ్రామాధికారులుగా విధుల్లో చేరే సమయానికి వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నప్పటికీ వారి సర్వీసులను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ జీరో సర్వీసుతో ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పాతికేళ్ల సర్వీసు గల్లంతు

పూర్వ వీఆర్వోలు 2007-08లో రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్ చేసింది. అప్పట్లో టెన్త్ విద్యార్హతతో ఉద్యోగాలలో జాయిన్ అయ్యారు. అప్పట్లోనే పే-స్కేలు ఇచ్చారు. అనంతరం 2014లో డిగ్రీ ఉత్తీర్ణులను వీఆర్వోలుగా తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 153 మంది పూర్వ వీఆర్వోలు, 1100 మంది పూర్వ వీఆర్ఏలు ఉన్నారు. వీఆర్ఏలలో అనేక మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అయితే వీరికి మొదట్లో పే స్కేలు ఇవ్వలేదు. 2023 లో వీఆర్ఏ వ్యవస్థను తొలగించినప్పుడు వారికి పేస్కేలు ఇస్తూ మిగతావారు నచ్చిన మున్సిపల్, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ తదితర 23 శాఖలలో నాల్గవ తరగతి ఉద్యోగులుగా విధుల్లో కొనసాగుతున్నారు. కాబట్టి వీరంతా మళ్లీ గ్రామ పరిపాలనాధికార వ్యవస్థలో భాగస్వాములు కావడానికి అంతగా ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తోంది. కానీ ఇప్పటికే పాతికేళ్లగా ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న వీఆర్వోలు మళ్లీ రాత పరీక్ష రాసి, ఉత్తీర్ణత పొంది, తమ సర్వీసును వదులుకుని కొత్తగా గ్రామ పరిపాలనాధికారులుగా విధుల్లో చేరడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

> **సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి**
>
> ప్రభుత్వం తీసుకొస్తున్న జీవో నెంబరు 129లో సవరణలు చేపట్టాలి. డిగ్రీ అర్హత, రాత పరీక్షల నిబంధనను రద్దు చేయాలి. సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలి.
>
> -కిషన్, పూర్వ వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఒక్కరూ ఆప్షన్ కోరలేదు

మెదక్ జిల్లాలో సుమారు 300లకు పైగా గ్రామ రెవెన్యూ క్లస్టర్లు ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా నియమించే గ్రామపరిపాలనాధికారుల నియామకాలకు పూర్వ వీఆర్వోల నుండి ఆప్షన్లు కోరుతుండగా ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ ఆప్షన్ కోరలేదు. జీవో 129 ను రద్దు పర్చడమో, లేదా సవరించడమో చేస్తే తప్ప తాము ఆప్షన్లు స్వీకరించమని చెబుతున్నారు. ఈ నెల 16 వ తేదీ లోగా ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంది. అయితే పూర్వ వీఆర్వోలతో రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం నిర్వహించాల్సిన సమావేశం 16వ తేదికి వాయిదా పడింది. ఆ రోజే ఆప్షన్లకు చివరి రోజు.



నిద్రావస్థలో..
నిఘానేత్రాలు

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- పెరుగుతున్న నేరాలు
- రెండునెలల వ్యవధిలో నాలుగు ఘటనలు

6లో

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి

అన్ని మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి : కలెక్టర్ రాహుల్ రాజ్



సర్దనలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, ఏప్రిల్13,(ఆంధ్రజ్యోతి); ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు జరగాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మండలంలోని సర్దన గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన పేషంట్లతో మాట్లాడి వైద్య సేవలు, వసతులు సక్రమంగా ఉన్నాయా, ఇబ్బందులున్నాయా అని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగుల సంఖ్య పెరగాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ ఎంలు, సిబ్బంది ఉన్నారు.



సన్ కాదు మూన్..

ఆకాశంలో చంద్రుడు సంధ్యా సమయంలో సూర్యుడిలా కనిపించాడు. ఇది పింక్ మూన్ ప్రభావమేనని తెలుస్తున్నది. వసంత కాలంలో వచ్చే మొదటి పౌర్ణమిని పింక్‌మూన్ అంటుంటారు, ఈ సమయంలో వాతావరణంలో వచ్చే మార్పు కారణంగా చంద్రుడు గులాబీ రంగులో కనిపిస్తాడు. ఈసారి ఆదివారం ఈ దృశ్యం కనిపించింది.

-మెదక్ కల్చరల్

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలో గాయపడిన కార్మికుడు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ అందించిన కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర(32) ఇస్నాపూర్‌లో నివాసమంటూ పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన విధి నిర్వహణలో ఉండగా పెయింటింగ్ మిషన్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో దేవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. పరిశ్రమ యజమాన్యం అపోలో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరిశ్రమలో


దేవేంద్ర (ఫైల్)

సేఫ్టీ లోపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుని, దేవేంద్ర మృతికి కారణమైందని పలువురు కార్మికులు మండిపడుతున్నారు. ఈనెల 5వ తేదీన ప్రమాదం చోటు చేసుకుంటే విషయం బయటకి పొక్కనీయకుండా యజమాన్యం గుట్టుగా వ్యవహరించడంపై కూడా స్థానికులు మండిపడుతున్నారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, సేఫ్టీపై నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

● 11 మందికి గాయాలు

కొండపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి గాయాలైన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పద్మానగర్‌కు చెందిన కొంతమంది ప్రైవేట్ బస్సులో హైదరాబాద్‌లోని వారి బంధువుల పెళ్లికి వెళ్లి శనివారం అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్గెట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని బస్సు వెనుకవైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణం చేస్తున్న రుద్ర లత, జొట్టు లక్ష్మీనారాయణ, ప్రణయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరితోపాటు జొట్టు ఓడేమ్మ, శ్రీలత, రుద్ర రాజకుమార్, అన్విత్, రాజవ్వ, మాధవి, జైదేవ్, సహస్రలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన రుద్ర లత, జొట్టు లక్ష్మీనారాయణ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

కారు ఢీకొని యువకుడి మృతి


తేజేశ్వరరావు(ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తేజేశ్వరరావు(32) జహీరాబాద్ పట్టణంలో పనులను ముగించుకుని శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై జహీరాబాద్‌నుంచి అల్గోల్ శివారులోని లెజెండ్‌వెల్లిలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్గోల్ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘనస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తేజేశ్వరరావు భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

పశుగ్రాసం, మోటార్ పైపులు దగ్ధం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు వరి గడ్డి, మోటారు పైపులు దగ్ధమయ్యాయి. మీర్జాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కళవ్వకు చెందిన వ్యవసాయ బావి వద్ద సాయంత్రం విద్యుత్ ట్రాన్సుఫార్మర్ నుంచి నిప్పురవ్వలు చెలరేగి ఎకరం పొలంలోని వరి గడ్డిపై పడడంతో దగ్ధమైంది. కరెంటు మోటారు వైర్లు, స్టాటర్, పైపులు కాలిబూడిదగా మారాయి. రూ.60 వేల నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు.

సఫాయి కార్మికురాలికి ఆర్థిక సాయం

గుమ్మడిదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలకు చెందిన సపాయి కార్మికురాలు రాజమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి కార్మికురాలు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయనతోపాటు సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు కాలకంటి బాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బంధువుల ఇంటికి వచ్చి చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం శివ్వంపేట మండల పరిధి కొత్తపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంకట్‌రావుపేట్ గ్రామానికి చెందిన నీలం శేఖర్(28) కొత్తపేట గ్రామంలో ఉండే బావ అంతరం జగన్ ఇంటికి వెళ్లాడు. కాగా, బావ జగన్‌తో కలిసి శనివారం రాత్రి స్థానిక రాయినికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో జేసీబీ గుంతలో పడి మృతి చెందాడు. జగన్ గ్రామస్థులకు సమాచారం ఇవ్వగా కుంట దగ్గరకు చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతిని తండ్రి వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.


నీలం శేఖర్(ఫైల్)

బీబీపేట్‌లో మహిళ అదృశ్యం


కుమ్మరి సునీత(ఫైల్)

కల్హేర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీబీపేట్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ అదృశ్యం అయినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి సునీత(35) శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇతర చోట్ల కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సునీత భర్త కుమ్మరి సాయిలు ఆదివారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సికింద్లాపూర్‌లో వివాహిత..

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాలతో భర్త మందలించగా వివాహిత ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన సంఘటన ఆదివారం సికింద్లాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర శ్యామల(45) భార్యాభర్తల మధ్య వివాదం నెలకొనడంతో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఎర్ర సత్యయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గుమ్మడిదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవితం మీద విరక్తి చెంది యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం గుమ్మడిదలలో చోటుచేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గుమ్మడిదలకు చెందిన బీర్ల నాగరాజు(30)కు కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అనితతో 15 నెలల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు తరచూ గొడవ పడేవారు. ఈ మధ్య కాలంలోనే గొడవ పడి అనిత తన పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషులు మాట్లాడి అనితను తిరిగి అత్తారింటికి తీసుకువచ్చారు. బంగారు నగలు లేకుండా రావడం గమనించిన నాగరాజు అమ్మ అనితను పుట్టింటికి పంపించింది. ఈక్రమంలో నాగరాజు శనివారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో ఎక్కడికి వెళ్లాడో తెలియక కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం గ్రామ శివారులోని బాల్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద ఓ వేప చెట్టుకు ఉరేసుకొని మృతిచెందినట్లు సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లారు. పుట్టింటికి వెళ్లిన తన కోడలు కాపురానికి వస్తుందో రాదో అని దిగులు చెంది ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు తల్లి బీర్ల సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కూరెళ్లలో ఇసుక డంపు పట్టివేత


కూరెళ్ల ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుక

కోహెడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరెళ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. మోయతుమ్మెద వాగు నుంచి కొందరు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ కూరెళ్లలో డంపు చేశారని పోలీసులకు ఆదివారం విశ్వసనీయ సమాచారం తెలిసింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి ఇసుక డంపును పట్టుకున్నట్లు పోలీసులు వివరించారు. సుమారుగా 12 టన్నుల ఇసుక ఉంటుందని పేర్కొన్నారు. ఇసుక డంపును రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి.. ఏడుగురిపై కేసు

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భూవివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం మల్లుపల్లిలో చోటుచేసుకున్నది. బాధితుడు, ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లుపల్లి గ్రామంలో సర్వేనంబర్ 526 భూమిలో సరిహద్దు వివాదం తలెత్తగా గ్రామానికి చెందిన గ్యాదరి శీనుపై కొందరు దాడి చేసి చొక్కాను చింపారు. గ్యాదరి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లుపల్లికి చెందిన గ్యాదరి ప్రవీణ్, కర్రే మహేష్, గ్యాదరి నెల్లూరు, గంజి మల్లేశం, బిక్షపతి, సాయిబాబు గ్రామానికి చెందిన పిట్ల శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వంతెన లేక..
కాలువ దాటడం తప్పక



తలపై సంచితో అప్పాయిపల్లి కాలువను తాడు సాయంతో దాటుతున్న రైతు

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలన్నా.. అత్యవసర పరిస్థితుల్లో అటు నుంచి ఇటు రావలన్నా ఆ గ్రామ రైతులకు కాలువ దాటక తప్పడం లేదు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ నుంచి వచ్చే కాలువ దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామం నుంచి వెళుతుంది. కాలువ అవతల గ్రామస్థులకు చెందిన సుమారు 600 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు ఈ పొలాలకు వెళ్లాలంటే కాలువపై బ్రిడ్జి లేక ప్రయాస పడుతున్నారు. గ్రామానికి దూరంగా ఓ బ్రిడ్జి ఉండగా, పక్కనే ఉన్న పొలాల వద్దకు అంత దూరం వెళ్లి చుట్టూ తిరగ లేక కాలువ దాటక తప్పడం లేదు. పొలాల వద్దకు ఎరువులు, యూరియా బస్తాలు తీసుకెళ్లేందుకు, అటు నుంచి ఏమైనా గ్రామానికి తీసుకొచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు ఈ కాలువను దాటేందుకు ఆపసోపాలు తప్పడం లేదు.



అప్పాయిపల్లి కాలువలో నుంచి ఓ రైతును ఎత్తుకొని దాటిస్తున్న మరో రైతు

ఘనంగా మట్టల ఆదివారం





మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, హత్నూరలో మట్టలతో క్రైస్తవులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మట్టలు సేకరించి వాటితో చర్చి ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు మట్టల ఆదివారం విశిష్టతను తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం కిక్కిరిసింది. ఈ సందర్భంగా భక్తులకు మతగురువులు ఆశీర్వచనాలందించారు. మట్టల పండుగలో డయాసిస్ మినిస్ట్రియల్ సెక్రెటరీ జయానంద్, తదితరులు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో

హత్నూర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని కొన్యాల, చీక్‌మద్దూర్, కాసాల, దౌల్తాబాద్, ముచ్చర్ల, రెడ్డిపాలెం, హత్నూర తదితర గ్రామాలలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు నిష్టతో ఉపవాస దినాలు పాటిస్తూ ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈత మట్టలు చేత పట్టుకుని ఆలయాల వద్దకు వచ్చి గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాసాల రెవరెండ్ బి.కాంతారావు గురువులు, కొన్యాల రెవరెండ్ అమృతరావు భక్తుల ఉద్దేశించి వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ మెంబర్లు పాముల భాస్కర్, ప్రభాకర్, సుభాష్, సాగర్, సంఘ పెద్దలు లక్ష్మణ్, పురుషోత్తం, ఆశయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోహీర్ మండలంలో

కోహీర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, కవేలి, గురుజువాడ, రాజనెల్లి, మద్రి, పీచేర్యాగడి, సజ్జాపూర్, బడంపేట, పర్వపల్లి, గొడిగర్‌పల్లి, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, చింతలఘట్టు గ్రామాలలో ఆదివారం మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈత జెబ్బలకు రంగురంగుల పూలను అలంకరించి గ్రామ పురవీధుల్లో క్రీస్తు కీర్తనలు పాడుతూ, క్రీస్తు విశిష్టతను తెలుపుతూ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతరం క్రీస్తు మరణం, పునరుద్ధరణ వంటి అంశాలపైన ఆయా సంఘ కాపరులు వ్యాక్యోపదేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ చర్చిల పాస్టర్లు, క్రైస్తవ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ముంపు.. సాగుకు దూరం

- వ్యవసాయ భూమి ఉన్నా పండించలేక పేద కుటుంబ దైన్యం
- అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం





పెద్దచెరువు కట్ట దిగువన భూమిలో నిల్వ ఉన్న మురుగు నీరు, నీటిని మళ్లించాలని వేడుకుంటున్న యాదగిరి

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు ఆయకట్టుకింద విలువైన భూమి ఉందని సంతోషించే కన్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో మురుగు నీటి డంపుగా మారడంతో పంటలు పండించుకోలేక జీవనోపాధి కోల్పోతున్నామని ఓ పేదింటి రైతుకుటుంబం రోదిస్తుంది. కనీసం ఇంటిల్లిపాది పొట్టనింపుకోవడానికైనా ఒక్క మడి పొలం అచ్చుకడదామనుకున్నా మురుగు నీటిమయంతో తుంగలు పరుచుకుని అడియాసలవడంతో దిగాలు చెందుతున్నారు. మురుగు నీటి మళ్లింపు నిలిపివేయాలని చాన్నాళ్లుగా పలుమార్లు మున్సిపల్, జిల్లా అధికారుల కాళ్లావేళ్లా పడి ప్రాథేయపడినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చేర్యాల పట్టణానికి చెందిన బస్వరాజు యాదగిరికి పెద్దచెరువు ఆయకట్టు కింద ఎ1-14 గుంటల భూమి ఉంది. పెద్దచెరువు కట్టను ఆనుకుని ఉండటంతో మంచిగా బోర్లు పోస్తుండడంతో గతంలో పంటలు పండించుకున్నారు. కానీ చాన్నాళ్లుగా పట్టణంలోని డ్రైనేజీని ఇటువైపు మళ్లించడంతో వ్యవసాయ భూమి కాస్త మురుగునీటి డంపుగా మారింది. పెద్దచెరువు సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, కాలువలు సక్రమంగా లేకపోవడం, ప్రధాన డ్రైయిన్‌కు అనుసంధానం చేయకపోవడంతో వాలు ప్రదేశానికి చేరుకుని ఈ భూమిలో నిల్వ ఉంటున్నాయి. నానాటికీ సమీప ప్రదేశంలో భవన నిర్మాణాలు పెరిగి విస్తరించడంతో ఆయా ఇళ్ల నుంచి మురుగు కాల్వల ద్వారా వచ్చే నీరంతా బస్వరాజు యాదగిరి పొలంలోకి చేరుతున్నాయి. దీంతో యాదగిరి పొలంతో పాటు సమీపంలోని భూములు దెబ్బతింటున్నాయి. సమీపంలోనే ఉన్న ఇంటిని ఆనుకుని పొలం అంతా డ్రైనేజీ నీటిమయమడం, దుర్గంధం వెదజల్లుతూ దోమలు విజృంభిస్తుండటంతో పాటు పందు స్వైరవిహారం చేస్తుండటంతో సమీప పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులతో పాటు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసినా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ఉసూరుమంటున్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా కొన్నాళ్ల క్రితం పెద్దచెరువు మత్తడి ఆవరణ నుంచి వరద నీటి మళ్లింపు కోసం కాలువ నిర్మించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో వర్షాకాలంలో వరదనీటితో పాటు డ్రైనేజీ నీరు ప్రవహించి సమీప ప్రదేశానికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. బస్వరాజు యాదగిరితో పాటు మరికొంత మంది పొలాల భూములుండటంతో వారి పరిస్థితి ఇదేమాదిరిగా నెలకొందంటూ వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి మురుగునీటిని రాకుండా మళ్లించాలని వేడుకుంటున్నారు.



పెద్దచెరువు సమీపంలో అసంపూర్తిగా మురికి కాలువ

కొండాపూర్‌లో అట్టహాసంగా కుస్తీ పోటీలు



కొండాపూర్‌లో కుస్తీ పోటీలో తలపడుతున్న పహిల్వాన్‌లు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం ఆవరణలో కుస్తీ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ప్రతీ యేటా హనుమాన్ జయంతి ఉత్సవాల మరుసటి రోజు కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఎండల తీవ్రత అధికంగా ఉన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పహిల్వాన్‌లు తలపడ్డారు. ఈ కార్యక్రమాన్ని అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ప్రారంభించారు. పహిల్వాన్‌లకు ప్రోత్సహించే విధంగా డప్పు చప్పుళ్లు, ఈలలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. రూ.10 నుంచి పహిల్వాన్ స్థాయి నుండి రూ.500 వరకు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీకి ఐదు తులాల వెండి కడియాన్ని బహుమతిగా అందించారు. కుస్తీ పోటీల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటి వసతి, ప్రాథమిక చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరక్‌పల్లి దేవిదాస్ మహరాజ్, రఘు, గోపాల్, కిషన్, విఠల్‌నాయక్, రాంచందర్, దేవిసింగ్, నందు, భక్లీరాంలు పాల్గొన్నారు.



పోటీలను తిలకిస్తున్న సంగ్రాం మహరాజ్, దేవిదాస్ మహరాజ్

మల్లన్న ఆలయం.. భక్తజనసంద్రం

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనం చేసి భక్తి ప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మ దర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖ మండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారింది. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగు చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం కార్యనిర్వహణాధికారి ఏ.భాస్కరావు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో అన్నపూర్ణ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం బహుకరించారు.



ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనం

కంగ్టి సిద్ధేశ్వరాలయం జాతరకు ముస్తాబు



ఆలయంలో కొలువుదీరిన సిద్ధేశ్వరుడు

కంగ్టి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న రాష్ట్ర సరిహద్దుల్లోని కంగ్టి సిద్దేశ్వర ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే వేడుకలకు పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సిద్దేశ్వరుడి ఆలయం వరకు నిర్వహించే స్వామివారి రథోత్సవం అద్భుత ఘట్టంగా చెప్పవచ్చు. 108 కట్టెలతో ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామి వారు ఆసీనులవ్వగా డప్పుచప్పుళ్ల, భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని లాగుతూ తీసుకెళ్లడం చూసేందుకు రెండు కళ్లు చాలవు. ఈనెల 16 నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకట్, ఈవో రుద్రప్పలు తెలిపారు. ఈనెల 16న రథంపై ప్రత్యేకంగా వెదురు కర్రలతో తయారు చేసిన భారీ శిఖరాన్ని అధిష్ఠింప చేస్తారు. 17న ఆలయంలో భజనలు, అన్నదానం, కొనసాగుతాయి. 18న వేకువ జామున స్వామివారి ఊరేగింపు, రథం ముందు అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. 19న కుస్తీ పోటీలు జరగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాలు ముస్తాబవ్వగా స్వామి వారి రథం పనులు చకచక సాగుతున్నాయి. 16న శిఖరోత్సవంతో జాతర ప్రారంభమౌతుండగా బుధవారం నుంచి వారం రోజుల పాటు స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు తమ తమ వ్యవసాయ, యాంత్రీకరణతో సాగే పనులకు విరామం ఇస్తారు. గతంలో శిఖరోత్సవం జరుగుతున్న తరుణంలో గ్రామంలో పిండిమరను నడుపుతున్న వ్యక్తి పట్టాలు తెగి మృతి చెందడం జరిగిందని, అప్పటి నుంచి శిఖరోత్సవం జరిగాకా వారం పాటు వ్యవసాయ పనులు, యంత్రాలతో సాగే పనులను స్వచ్ఛందంగా నిలిపి వేస్తూ వస్తున్నారు.

వనదుర్గమ్మ సన్నిధి కిటకిట



ఏడుపాయల వనదుర్గమాత ఆలయంలో భక్తులు



పాపన్నపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, కుంకుమార్చన చేసి, అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బేతాళుడి జాతర చూసొద్దాం రండి!

- నేటి నుంచి అల్లాదుర్గంలో ఉత్సవాలు





అల్లాదుర్గంలోని శ్రీబేతాళస్వామి ఆలయం, కొలువుదీరిన స్వామివారు

అల్లాదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా పిలువబడే అల్లాదుర్గంలోని బేతాళస్వామి జాతర ఉత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రారంభకానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడలేని బేతాళస్వామి ఆలయం అల్లాదుర్గంలో ఉండటంతో ఈ స్వామిని కొలిచేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వారే కాకుండా సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు విచ్చేస్తారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా నాలుగు రోజుల ముందుగా పట్టణంలోని పోలేరమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, బేతాళస్వామికి బోనాలతో ఊరేగించి ఆయా ఆలయాల్లోని అమ్మవారికి, స్వామికి బోనాలను సమర్పిస్తారు. ఈ నెల 18న ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు, అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నవాజ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.






బెజ్జంకి లక్ష్మీనృసింహ ఆలయం గుట్ట కింద వెలుగులు విరజిమ్ముతున్న తాత్కాలిక దుకాణాలు, గజవాహనంపై పురవీధుల గుండా ఊరేగుతున్న నృసింహస్వామి

నృసింహుడి క్షేత్రం.. రథోత్సవానికి సిద్ధం

బెజ్జంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ప్రారంభమయ్యే రథోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. తెల్లవారు జామున గుట్టపైన ప్రధాన ఆలయంలోని ఉత్సవమూర్తులకు అర్చకులు విశేష పూజలను నిర్వహించి కిందకు తీసుకురానున్నారు. రథంపై నెలకొల్పి భక్తుల గోవిందా నామస్మరణల మధ్య ఏకశిల గుట్ట చుట్టూ తిప్పనున్నారు. రథం ఎదుట దీవిటీలు వెలగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటారు. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏకశిల గుట్ట ప్రాంతం భక్తజనసంద్రంగా మారింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తును నిర్వహిస్తున్నారు.

గజవాహనంపై ఊరేగిన నృసింహస్వామి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి గజవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



గుట్ట కింద బయటకు తీసిన రథం

నిద్రావస్థలో.. నిఘానేత్రాలు

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- పెరుగుతున్న నేరాలు
- రెండునెలల వ్యవధిలో నాలుగు ఘటనలు

మనోహరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న 44వ జాతీయ రహదారిపై భద్రత కరువైంది. నిఘా యంత్రాలు పనిచేయకపోవడంతో నేరాలు, ప్రమాదాలు పెరుగుతున్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో చిన్నా, చితక పరిశ్రమలు కలిపి 200ల వరకు ఉంటాయి. అనేక రాష్ట్రాల నుంచి కార్మికులు జీవనోపాధికి వచ్చి కాళ్లకల్‌లో అద్దెకు ఉంటూ పరిశ్రమల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఆదివారం సంత కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు 10 వేల మందివరకు వస్తారు. సంతరోజే అనేక చోట్ల ఫోన్లు చోరీ జరుగుతున్నాయి.

రెండు నెలల వ్యవధిలో...

కాళ్లకల్ గ్రామంలో రెండునెలల వ్యవధిలో నాలుగు నేరాలు జరిగాయి. గతనెల 23న కూచారంతండాకు చెందిన మాలోత్ లత జామకాయలు అమ్ముతుండగా ఇద్దరు దుండగులు పుస్తెలతాడు చోరీకి యత్నించారు. మూడురోజుల క్రితం ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పాప కిడ్నాప్‌కు యత్నించగా.. స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అలాగే మంగళవారం ఇదే గ్రామానికి చెందిన వీరబోయిన గోపాల్ స్కూటీని దొంగలించారు. అదేవిధంగా మార్చి 9న కూడా ఓ ఘటన చోటు చేసుకున్నది.



కాళ్లకల్‌లో గంజాయి పట్టుకున్న పోలీసులు(ఫైల్)

పనిచేయని సీసీ కెమెరాలు

గ్రామంలో ఐదేళ్ల క్రితం దాతల సహకారంతో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి పనిచేయడం లేదు. గ్రామంలో అనేక రాష్ట్రాల ప్రజలు ఉండటంతో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మేజర్ గ్రామ పంచాయతీ అయిన కాళ్లకల్‌లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాళ్లకల్ రోడ్డుపై పనిచేయని సీసీ కెమెరా

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాం



గ్రామాల్లో జరుగుతున్నా నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాం. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరైన సౌకర్యాలు లేక పనిచేయడం లేదు. కాళ్లకల్ మేజర్ గ్రామంలో నిత్యం నేరాలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. గతంలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తున్నాం. జాతీర రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మనోహరాబాద్ జాతీయ రహదారి గుండా 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

- సీఐ రంగాకృష్ణ, తూప్రాన్

గ్రామంలో నిఘా పెంచాలి



మనోహరాబాద్ మండలంలో కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలా కార్మికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. 16 రోజుల వ్యవధిలో రెండు ఘటనలు జరిగాయి. అధికారులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, గ్రామంలో పెట్రోలింగ్ చేయాలి.

- మాధంశెట్టి వెంకటేశంగుప్తా, కాళ్లకల్ గ్రామస్థుడు

సన్నబియ్యం పంపిణీతో పేదల కళ్లలో ఆనందం



మనూరు మండలం దుద్దగొండలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జహీరాబాద్ పట్టణంలోని గడివీధిలో సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

మనూరు/నారాయణఖేడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం పంపిణీతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మనూరు మండలం దుద్దగొండలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు విడుతలవారీగా నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది సంగన్న, వినోద్‌పాటిల్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తుమ్మూర్, దుద్దగొండ గ్రామాల్లో నిర్వహించిన బీరప్ప జాతరలో పాల్గొన్నారు. తుమ్నూరు గ్రామస్థులు గొల్ల కురుమ సంఘం కమ్యూనిటీహాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. నారాయణఖేడ్ పట్టణంలోని ఏఎస్ నగర్‌లో ఆదివారం రాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన చంద్రశేఖర్ ఇంటి స్థలంలో ఇటీవల భారీ శివలింగం బయల్పడింది. కుటుంబసభ్యులు స్వయంభువుగా శ్రీరాజరాజేశ్వరుడే శివలింగం రూపంలో ప్రత్యక్షమయ్యాడని, కాలనీవాసుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టి, ఆదివారం పురోహితులు వెంకటేష్‌జ్యోషి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రాములు, కాంగ్రెస్ నాయకులు వినోద్‌పాటిల్, న్యాయవాది సంగన్నతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని గడివీధికి చెందిన మంగలి ఆనంతరామ్, వడ్లజగన్‌ల ఇంట్లో కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఇదిలా ఉండగా గడి వీధిలోని పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు.

మంత్రికి జాతర ఉత్సవాల ఆహ్వాన పత్రిక



దామోదర్ రాజనర్సింహకు జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి

రాయికోడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర జాతర ఈనెల 17 నుంచి 22 వరకు జరుగుతుంది. ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు గొల్ల అంజయ్యకు జాతర ఆహ్వాన పత్రికను సంగారెడ్డిలో అందజేశారు. జాతరకు అన్ని ఏర్పాట్లను చేయాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింలు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సతీష్ కులకర్ణి, ఆలయ ఈవో శివ రుద్రప్ప, నాయకులు కేదార్‌నాథ్ పాటిల్, వినయ్‌కుమార్, భీమన్న, శివకుమార్, వెంకటేశం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వేసవిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల చాలా జాగ్రతగా ఉండాలన్నారు. ఏదేని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే 101 ఫోన్ చేస్తే సిబ్బంది అగ్నిమాపక యంత్రంతో అక్కడికి వచ్చి మంటలు ఆర్పే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక ఫైర్‌మన్ ఐలయ్య, జానారెడ్డి, వెంకటేశం, ఆపరేటర్ అనిల్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, బాల్‌రెడ్డి, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్

- మాజీ ఎంపీ బీబీపాటిల్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అడుగడుగునా కాంగ్రెస్ అవమానించిందని బీజేపీ మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక గోల్కొండ వీధిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసి పూలమాలవేశారు. స్వచ్ఛభారత్ నిర్వహించి చీపురు పట్టుకొని పరిసరా ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ అంబేడ్కర్ జయంత్యోత్సవాల్లో భాగంగా 25 వరకు అంబేడ్కర్ విగ్రహాల శుద్ధి కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు

చేగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొన్ని మతతత్వ పార్టీలు భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడిపై ఉన్నదని కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో మండల కోఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మతతత్వ పార్టీల కుట్రలో రాజ్యాంగం నలిగిపోవద్దని రాజ్యాంగం అన్నిరకాల ప్రజలకు ఎంతో మేలు చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, టెలికం బోర్డు మాజీ మెంబర్ అంచునూరు రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై సన్నద్ధం కావాలి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు పోరాడేందుకు సన్నద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో 'రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఆధునిక కాలంలోనూ సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్నారని, ప్రపంచంలో ఎన్నో దేశాలు మన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని వారి రాజ్యాంగాలను రూపొందించుకున్నాయని అన్నారు. ఈ సెమినార్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, జీ.సాయిలు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న క్రాంతికిరణ్, రెంజర్ల రాజేశ్

అల్లాదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ప్రజా కళాకారులు, దక్షిణ భారత సమత సైనిక్ దళ్ అధ్యక్షుడు రెంజర్ల రాజేశ్ అన్నారు. అల్లాదుర్గంలో అంబేడ్కర్ యువజన సంఘం, బహుజన ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు.

'అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దాం'

నారాయణఖేడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు, ఖేడ్ రక్తదాతల గ్రూపు వ్యవస్థాప అధ్యక్షుడు ముజాహెద్‌చిస్తీ, మానవ హక్కుల పరిరక్షణ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఖేడ్ పల్లవి పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం: ఎమ్మెల్యే



మొగుడంపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్/నారాయణఖేడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అందరం తరలివెళ్లి జయప్రదం చేద్దామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. 16 నెలల్లోనే కాంగ్రెస్ పాలన తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజలు చూయిస్తున్న ఆదరణ చూస్తుంటే మరో రెండేళ్ల తర్వాత మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల పార్టీల అధ్యక్షులు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బహిరంగ సభను దిగ్విజయం చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం ఖేడ్‌లో మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబీనాబేగంనజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కాంగ్రెస్ అబద్ధపు హామీలను ఎండగడుతాం



నగేష్‌గౌడ్

పుల్‌కల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన ఆచరణకు సాధ్యం కాని హామీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడుతామని బీఆర్ఎస్ పుల్కల్ మండల నాయకుడు నాయకవాడి నగేష్ గౌడ్ అన్నారు. ఈ నెల 27న హన్మకొండ సమీపంలోని ఎల్కతుర్తి వద్ద జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు కార్యకర్తలను సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం గొంగ్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ 420 హామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. గద్దెనెక్కాక ఆరు గ్యారంటీలను అమలు చేయక చతికిల పడిందని ఎద్దేవా చేశారు. ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నగేష్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చేగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలంలోని అనంతసాగర్, ఉల్లి తిమ్మాయపల్లి, వడియారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ బోనగిరి బాగులు ప్రారంభించారు.

రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న సుభాష్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్సీ దంపతులను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పొదలు తొలగింపు

పుల్‌కల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముదిమాణిక్యం-మిన్‌పూర్ గ్రామాల శివారు సరిహద్దు మూలమలుపు వద్ద పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ ఆదివారం తొలగింపజేశారు. సంగారెడ్డి-సింగూరు ప్రధాన రహదారి ముదిమాణిక్యం మూల మలుపు అనునిత్యం ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ విషయాన్ని గమనించిన ఎస్ఐ ప్రత్యేక చొరవ తీసుకుని ఎక్స్‌వేటర్ సహాయంతో మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐని పలువురు ప్రశంసించారు.

'సమస్యలు పరిష్కరించండి'

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : తపాలశాఖలో ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంగారెడ్డి డివిజన్ కన్వీనర్ పరమేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం సంగారెడ్డిలోని తపాల శాఖ డివిజన్ పర్యవేక్షకుడు మురళీకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

'విద్యుత్ సిబ్బందిని సస్పెండ్ చేయాలి'

పుల్‌కల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పుల్కల్ మండలం మిన్‌పూర్ గిరిజనతండాలో రైతు రమావత్ రమేశ్ మృతికి కారణమైన విద్యుత్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గిరిజన సమీపంలోని వరి పొలంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన తీగ తెగిపడినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

67వ రోజుకు దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 67వ రోజుకు చేరాయి. గుమ్మడిదల, దోమడుగు గ్రామ ప్రముఖులు జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, మద్ది బాల్‌రెడ్డి, మద్దిమోహన్‌రెడ్డి, పుట్ట ఎల్లయ్య, పెంటారెడ్డి, రాము దీక్షకు సంఘీభావం తెలిపారు.

కొనసాగుతున్న సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు

ఝరాసంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామ శివారులో గల సిద్ధేశ్వరస్వామి జాతర కొనసాగుతోంది. ఉత్సవాలకు కర్ణాటకతో పాటు నారాయణఖేడ్, న్యాల్‌కల్ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారికి పల్లకీసేవ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రవేశంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గ్రామాలు, పట్టణాల్లో దర్శనమిస్తున్నాయని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 'చలో గావ్ చలో బస్తీ' కార్యక్రమంలో భాగంగా చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు.

దరఖాస్తుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్

- నేడే చివరిరోజు
- చౌటకూర్ ఎంపీడీవో శంకర్

పుల్‌కల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు చౌటకూర్ ఎంపీడీవో కె.శంకర్ తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా పత్రాలను చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లక్షా 50 వేలలోపు ఆదాయం కలిగిన అభ్యర్థులందరూ దరఖాస్తుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఎంపీడీవో శంకర్ కోరారు.

ముస్లింలను అణగదొక్కేందుకే వక్ఫ్ బిల్లు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ముస్లింలను అణగదొక్కేందుకే బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బిల్లును ఆమోదించిందని ముస్లిం మతపెద్దలు మౌలానా మహ్మద్ తాహేర్‌అలీషా నూరీ, ముఫ్తీ అస్లాం సుల్తాన్‌కాస్మీ, మౌలానా అతర్ మోహియుద్దీన్ షామీద్, మౌలానా అహ్మద్ అజీజీలు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం సంగారెడ్డిలో మదీనా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అన్ని మతాలను సమానంగా చూడాలని నల్ల చట్టాలు, వక్ఫ్ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాజిల్ ఇర్ఫానీ, హబీబ్, రసూల్, షకీల్, మేరాజ్ ఖాన్, హాష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రామాలయం ఉత్సవాలు



రథోత్సవంలో భక్తులు

తూప్రాన్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని పురాతన రామాలయంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 4న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా సీతారామచంద్రస్వామికి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం అనంతరం ఆనవాయితీ ప్రకారం మిఠాయిలను రథోత్సవం నుంచి ఎగురవేయగా భక్తులు మహా ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం స్వామికి చక్రస్నానం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు.

'ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి'

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం సంగారెడ్డిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, ఉపాధ్యక్షులు కాశీనాథ్, జాదవ్, జిల్లా కార్యదర్శులు అరుణశ్రీ, సాయితేజ, సింహాచలం, చందర్ రాథోడ్ పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిలు ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బసవేశ్వర చౌక్‌ను ల్యాండ్‌మార్క్‌గా చేద్దాం

నారాయణఖేడ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్‌ను ల్యాండ్‌మార్క్‌గా తీర్చిదిద్దుదామని నారాయణఖేడ్ మాజీ మున్సిపల్ చైర్మన్, లింగాయత్ సమాజ్ తాలుక అధ్యక్షుడు ఆనంద్ స్వరూప్‌షెట్కార్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన లింగాయత్ సమాజ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వగురు బసవేశ్వరుడు అందరివాడని అన్నారు. బసవేశ్వరుడి ప్రాముఖ్యతను సమాజానికి చాటి చెప్పడం కోసం ప్రస్తుతం ఉన్న విగ్రహం స్థలంలో నారాయణఖేడ్‌లో నూతన విగ్రహాన్ని భారీగా ఏర్పాటు చేద్దామన్నారు. ఈనెల 30న బసవ జయంతి ఉన్నందున భారీఎత్తున కార్యక్రమాలను నిర్వహించడానికి కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు శెట్టిశంకర్, నాగ్‌శెట్టి, అంతారం వీరన్న, శివకుమార్, జగదీశ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద పగిలిన భగీరథ పైపు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

అల్లాదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని చిల్వర్, ముస్లాపూర్, గడిపెద్దాపూర్, అల్లాదుర్గం తదితర గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందించే పైపులైన్ తరచూ పగిలిపోతున్నది. ఆదివారం మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోతున్నది. నిత్యం సమస్య ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హత్నూర: సమ్మేళనంలో విద్యార్థులు

హత్నూర/చేగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని తుర్కలఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ విద్యార్థులు, నార్సింగి మండల కేంద్రంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో 2000-2001 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం ఆనాడు చదువుచెప్పిన గురువులను సత్కరించారు.



చేగుంట: సమ్మేళనంలో విద్యార్థులు